విభూది బుధవారం (A) – 18 ఫిబ్రవరి 2026

Ash Wednesday (A) – 18.02.2026

యోవేలు 2:12–18;

2 కొరింథీయులు 5:20–6:2;

మత్తయి 6:1–6, 16–18

ఉపోద్ఘాతం

ఒకసారి ఒక ప్రయాణికుడు ఎడారి అంచున ఆగి, అక్కడున్న ఒక వృద్ధుణ్ణి అడిగాడు:

"ఈ ఎడారిని దాటడానికి ఎంత సమయం పడుతుంది?"

ఆ వృద్ధుడు సమాధానమిచ్చాడు: "నడవు."

"కానీ ఎంత సమయం?" అని ప్రయాణికుడు మళ్లీ అడిగాడు.

"నడవు," అని ఆయన మళ్లీ చెప్పాడు.

ప్రయాణికుడు నడక మొదలుపెట్టిన తర్వాతే ఆ వృద్ధుడు అన్నాడు:

"సుమారు నలభై రోజులు."

ఈ రోజు, ప్రియమైన సోదర సోదరీమణులారా, మనమూ అలాంటి ఒక ప్రయాణం అంచున నిలబడి ఉన్నాము.

విభూది బుధవారంతో మనం ఉపవాసకాల ఎడారిలోకి అడుగుపెడుతున్నాము—
నలభై రోజులు. ఇవి జీవితం నుండి పారిపోవడానికికాదు, జీవిత దిశను మళ్లీ కనుగొనడానికి
ఇచ్చిన రోజులు.

ఈసంవత్సరం తొందరపాటుతనంనుండి, అలవాట్ల నుండి, రోజువారీ నడక నుండి కొంతకాలం
విడిపోయి, దేవుడు మనలో పనిచేయడానికి, మనద్వారా పనిచేయడానికి ఇచ్చిన కాలం ఇది.
విభూది బుధవారం మనకు మనం తరచుగా మరిచిపోయే రెండు సత్యాలను గుర్తు చేస్తుంది:
జీవితం సున్నితమైనది. సమయం అమూల్యమైనది.

అదే సమయంలో ఇది ఆశతో కూడిన మాటను కూడా చెబుతుంది:
దేవుడు సమీపంలో ఉన్నాడు, ఇప్పుడు కృపాకాలం.
ఈ పవిత్ర కాలాన్ని ప్రారంభిస్తున్నప్పుడు, యుద్ధం, హింస, అన్యాయం వల్ల బాధపడుతున్న
మన ప్రపంచాన్ని—ప్రత్యేకంగా బాధితులను—
మనసులో పెట్టుకొని, మన హృదయాలను దేవునివైపు మరల్చమని ఆయనను ప్రార్థిద్దాం.
అప్పుడు మనం శాంతి, కరుణ, స్వస్థతకు సాధనాలమవుతాము.
అందుకే, నిజాయితీగా ప్రభుని ముందు నిలబడి, ఆయన కరుణను కోరుదాం.

ప్రసంగం **"సంపూర్ణ హృదయంతో నా వైపు తిరుగు"**

ఒక మనిషి తన తాత గారి అల్మారాలో పాత దిక్సూచి (కాంపాస్) ఒకటి కనుగొన్నాడు. ఆసక్తితో దాన్ని తీసుకొని పర్వతయాత్రకు వెళ్లాడు. కానీ ఏ దిశకు తిరిగినా, దిక్సూచి సరిగ్గా చూపించట్లేదనిపించింది. నిరాశతో దాన్ని పారవేయబోతుండగా, ఒక వృద్ధ పాదయాత్రికుడుఅతనితో అన్నాడు:

"దిక్సూచి చెడిపోలేదు. నువ్వు లోహానికి చాలా దగ్గరగా నిలబడ్డావు. కొంచెం దూరంగా నిలబడు—మళ్లీ ఉత్తరాన్ని చూపిస్తుంది."

ఉపవాసకాలం ద్వారా దేవుడు మనతో ఇదే చెబుతున్నాడు:

కొంచెం దూరంగా నిలబడు.

నీ హృదయాన్ని దారి తప్పిస్తున్న వాటి నుండి—

శబ్దం, అలవాట్లు, దృష్టిభంగాలు, తప్పుడు భద్రతల నుండి—

కొంచెం దూరంగానిలబడు. అప్పుడు నీ అంతర్గత దిక్సూచి మళ్లీ దేవునివైపు చూపిస్తుంది.

విభూది బుధవారం ఆ దిక్సూచిని మన చేతుల్లో పెడుతుంది.

1. విభూది : మాయలేని సత్యం

ఈ రోజు మనం వినే మొదటి పఠనంలోని మాటలు మనల్ని కుదిపేస్తాయి:

"నీవు ధూళివని; మళ్లీ ధూళియగుదువు జ్ఞాపకం ఉంచుకో ."

యౌవనంగా ఉండాలని, బలంగా కనిపించాలని, పరిమితులను దాచాలని చెప్పే

ఈ ప్రపంచంలో ఈ మాటలు కఠినంగా అనిపిస్తాయి. బలహీనతను దాచడం, మరణాన్ని దూరం

గా ఉంచడం మనకు అలవాటు. కానీ విభూది   బుధవారం ఆ మాయను అంగీకరించదు.

ఇదిమనల్ని భయపెట్టడానికి కాదు, స్వేచ్ఛ ఇవ్వడానికనే సత్యాన్ని చెబుతుంది.

ఒక పెద్ద కంపెనీ అధికారి, తీవ్రమైన గుండెపోటు నుంచి బయటపడ్డాక అన్నాడు:

“నా జీవితంలో మొదటిసారిగా, నేను లేకపోయినా ప్రపంచం సజావుగానే నడుస్తుందని

గ్రహించాను.”

ఆ అవగాహన అతన్ని మార్చింది. విజయాన్ని వెంబడించే సమయం తగ్గింది; సంబంధాలను

పెంచి పోషించే సమయం పెరిగింది.

మరణమనే సత్యాన్ని అంగీకరించడం అతని ప్రాధాన్యతలను సరిచేసింది.

బూడిద కూడా అదే చేస్తుంది. జీవితం చిన్నదే—

కానీ అందుకే విలువైనది. మనం ఎలా జీవిస్తున్నామన్నది ముఖ్యం.

2. “సంపూర్ణ హృదయంతో నా వైపు తిరుగు” (యోవేలు)

యోవేలు ప్రవక్త “మిమ్మల్ని మీరే మెరుగుపరుచుకోండి” లేదా “ఇంకా ప్రయత్నించండి”

అని చెప్పడు.

అతను చెబుతున్నది: “సంపూర్ణ హృదయంతో నా వైపు తిరుగు.”

తిరుగుట అంటే—

మనమిప్పటికే దేవునివారమే అన్న అర్థం. ఉపవాసకాలం దేవుని ప్రేమను సంపాదించడానికి కాదు; ఆ ప్రేమవైపుతిరిగి రావడానికి.

ఒకసారి ఒక గురువు పిల్లలను అడిగాడు:

“పశ్చాత్తాపం అంటే ఏమిటి?”

ఒక చిన్నారి సమాధానమిచ్చాడు:

“తప్పు దారిలో వెళ్తున్నప్పుడు తిరిగి మళ్లడం.”

సరళమైన మాట—లోతైన ధార్మిక సత్యం.

పశ్చాత్తాపం అంటే మనల్ని మనమే నిందించుకోవడం కాదు; దిశ మార్చుకోవడం.

మన అంతర్గత దిక్సూచిని దేవుడు మళ్లీ సరిచేయనివ్వడం.

3. పునీత పౌలు యొక్క అత్యవసరం: “ఇప్పుడే”

పునీత పౌలు ఈ సందేశాన్ని మరింత గట్టిగా చెబుతాడు:

“ఇప్పుడే అనుకూల సమయం. ఇప్పుడే రక్షణ దినం.”

జీవితం శాంతించినప్పుడు కాదు. విరమణ తర్వాత కాదు. ఈస్టర్ తర్వాత కాదు. ఇప్పుడే.

ఒక మనిషి అన్నాడు: “నాకు సమయం దొరికినప్పుడు ప్రార్థిస్తాను.”

ఏళ్ల తర్వాత అతను ఒప్పుకున్నాడు:

“సమయం ఎప్పుడూ రాలేదు—కారణాలే వచ్చాయి.”

ఉపవాసకాలం మన కారణాలను అడ్డుకుంటుంది.

కృపను వాయిదా వేయలేమని మనకు గుర్తు చేస్తుంది. దేవుడు మనలను ఇప్పుడే కలుస్తాడు,

మన ఊహల భవిష్యత్తులో కాదు.

4. తప్పు ఉద్దేశంతో మంచి చేయడం అనే ప్రమాదం

సువార్తలో యేసు మూడు పవిత్ర ఆచరణలను పేర్కొంటాడు: ప్రార్థన, ఉపవాసం, దానం.

ఆయన వాటిని విమర్శించడు; ఒక సూక్ష్మమైన ప్రమాదాన్ని వెలుగులోనికి తెస్తాడు—

ప్రదర్శన.

ఒక ప్రసిద్ధ మాట ఉంది:

“అహంకారమును పరిశుద్ధత అద్దంలా మార్చగలదు.”

ఆచరణలు గుర్తింపు, నియంత్రణ, స్వీయసంతృప్తి కోసం మారిపోవచ్చని యేసు తెలుసు. అందు

కే ఆయన మళ్లీ మళ్లీ అంటాడు:

“రహస్యంగా చూచే మీ తండ్రి.”

దేవుడు ఆచరణల కంటే ఉద్దేశాన్ని చూస్తాడు.

ఒక సన్యాసిని అడిగారు: “మీరు ఇంత నిశ్శబ్దంగా ఎందుకు ప్రార్థిస్తారు?”

అతను సమాధానమిచ్చాడు:

“దేవుడు చెవిటివాడు కాదు—నా హృదయమే వినిపించుకోవాలి.”

ఉపవాసకాలం ఆ హృదయాన్ని స్వస్థపరచి శాంతించే కాలం.

5. ప్రార్థన, ఉపవాసం, దానం: ఒకే మార్గం

ఇవి వేర్వేరు పనులు కాదు; ప్రేమ యొక్క ఒకే ప్రయాణం.

ప్రార్థన మనలను దేవునివైపు తిప్పుతుంది.

దానం మనలను ఇతరులవైపు తిప్పుతుంది.

ఉపవాసం మనల్ని లోపలికి—స్వేచ్ఛవైపు—తిప్పుతుంది.

ఉపవాసం అంటే ఆహారం మానేయడం మాత్రమే కాదు. అసలు ప్రశ్న: నన్ను నియంత్రిస్తున్నది ఏమిటి?

ఒకరు అన్నాడు:

“ఆహారం మానేసినప్పుడు, నేను ఆకలికంటే అలవాటు, ఒత్తిడి, విసుగుతోనే ఎక్కువగా తింటానని గ్రహించాను.”

ఆ గ్రహణమే కృప.

నిజమైన ఉపవాసం స్థలాన్ని సృష్టిస్తుంది—దేవునికి, కరుణకు, వినటానికి.

ఉపవాసం మనలను మరింత మృదువుగా, ఓర్పుగా, పేదల పట్ల సున్నితంగా చేయకపోతే, అది తన లక్ష్యాన్ని చేరలేదు.

6. బూడిదే చివరి మాట కాదు

ఈ రోజు మనం పొందే బూడిద కాలిన తాళపత్రాల నుండి వచ్చింది—

ఒకప్పుడు విజయం సూచించినవి, ఇప్పుడు ధూళి.

అది యాదృచ్ఛికం కాదు. మన విజయాలూ క్షీణిస్తాయని అది చెబుతుంది.

అదే సమయంలో, ముగిసిపోయినట్టే అనిపించే వాటి నుండి దేవుడు కొత్త జీవితం తీసుకురాగల డని కూడా చెబుతుంది.

బూడిదను క్రూసు ఆకారంలో ఉంచుతారు—వృత్తం కాదు, గీత కాదు.

ఆ క్రూసు ఆశను ప్రకటిస్తుంది: మన ధూళిని క్రీస్తు తాకాడు.

ఒక తోటమాలి అన్నాడు:

“మరణించిన వాటి నుంచే ఉత్తమమైన నేల తయారవుతుంది.”

మన విఫలాలు, నష్టాలు, విరిగినతనాన్ని దేవుడు వృథా చేయడు. ఆయన చేతుల్లో అవి సార వంతమైన నేల అవుతాయి.

ఒక పైలిస్ గురువు తన విద్యార్థితో ఇలా అన్నాడు:

“పొరపాట్లు చేయకుండా ఉండటానికి సాధన చేయవు.

పొరపాట్లు భయపెట్టకుండా ఉండేందుకు సాధన చేస్తావు.”

ఉపవాసకాలం కూడా అలాంటిదే. సంపూర్ణులం కావడం కోసం కాదు; దేవుని ముందు నిర్భ యంగా, నిజాయితీగా, మళ్లీమొదలుపెట్టడానికి.

ఈ నలభై రోజులు బూడిద ముద్రతో నడుస్తున్నప్పుడు, మన ముఖాలు దిగాలుగా కాకుండా, హృదయాలు వికాసవంతంగ ఉండాలి.

ఎందుకంటేమనలను పిలిచే దేవుడు కృపగలవాడు, కరుణగలవాడు, కోపించడంలో నెమ్మదిగా,

దయలో సమృద్ధిగా ఉన్నవాడు.

బూడిద బుధవారం మనం ఎవరో చెబుతుంది: ధూళి.

ఉపవాసకాలం దేవుడు ఎవరో చెబుతుంది: విశ్వసనీయుడు.

ఈస్టర్ మనం ఎక్కడికి వెళ్తున్నామో చెబుతుంది: జీవితం.

“దేవా, మాలో పరిశుద్ధ హృదయాన్ని సృష్టించు,

మాలో స్థిరమైన ఆత్మను పునరుద్ధరించు.” ఆమేన్.

Shorter HOMILY

ఒక ప్రసిద్ధ వైలినిస్ట్ ఒకసారి సాధారణ దుస్తుల్లో రద్దీగల మెట్రో స్టేషన్‌లో వాయించాడు. చాలా మంది గమనించకుండా వెళ్లిపోయారు. కొద్దిమంది మాత్రమే ఆగారు.

కొన్ని రోజులకు, అదే కళాకారుడు ఒక సంగీత మందిరాన్ని నిర్మించాడు; వినడానికి ప్రజలు పెద్ద మొత్తాలు చెల్లించారు. సంగీతం మారలేదు. మారినది—వినే మనసు.

బూడిద బుధవారం మన బిజీ జీవిత మధ్యలో దేవుడు మృదువుగా తన సంగీతాన్ని వాయించడమే.

ఉపవాసకాలం మనలనుఆగమని, వినమని, అడగమని ఆహ్వానిస్తుంది:

నేను అలాంటి వాటిని చాలా వేగంగా దాటిపోతున్నాను?

ఈ రోజు పఠనాలు ఉపవాసకాల హృదయాన్ని స్పష్టంగా చూపిస్తున్నాయి.

యోవేలు ప్రవక్త పిలుపునిస్తాడు:

“సంపూర్ణ హృదయంతో నా వైపు తిరుగు.”

అర్థాంతరంగా కాదు. బయటకు కాదు. హృదయంతో.

పునీత పౌలు అత్యవసరంగా చెబుతాడు:

“ఇప్పుడే అనుకూల సమయం. ఇప్పుడే రక్షణ దినం.”

రేపు కాదు. జీవితం సర్దుకున్న తర్వాత కాదు. ఇప్పుడే.

యేసు సువార్తలో మృదువైన వాస్తవికతతో మాట్లాడతాడు. ప్రార్థన, ఉపవాసం, దానం—

సరైన పనులు—తప్పు ఉద్దేశాలతో చేయకూడదని హెచ్చరిస్తాడు.

ఆయన వారిని తిట్టడం కాదు; శుద్ధి చేయడం.

ఒక పిల్లాడు అడిగాడు:

“ఉపవాసకాలంలో చాక్లెట్ ఎందుకు మానేస్తారు?”

తల్లి చెప్పింది: “యేసును గుర్తు చేసుకోవడానికి.”

పిల్లాడు ఆలోచించి అన్నాడు:

“అయితే మనం ఇంకా దయగా మారాలికదా?”

ఆ ప్రశ్నే సువార్త సారాంశం

మనలను మార్చని ప్రార్థన,

స్వేచ్ఛ ఇవ్వని ఉపవాసం,

కరుణ కలిగించని దానం—

లక్ష్యాన్ని చేర్చలేవు.

ఈ రోజు మనం స్వీకరించే విభూది మనకొక సత్యాన్ని చెబుతుంది:

మనము సున్నితులం, ఆధారపడినవారం

కానీ అది క్రూసు ఆకారంలో ఉంది—

మన బలహీనత దేవుని కరుణలో ఆలింగనం పొందిందని గుర్తు చేస్తుంది.

ఒక సన్యాసి అన్నాడు:

"ఉపవాసకాలం మరొకరుగా మారడానికి కాదు,

దేవుడు ఇప్పటికే చూసే మనల్ని మనం కావడానికి."

ఈ నలభై రోజులు మనలను మరింత నిజాయితీగా ప్రార్థించడానికి,

సరళంగా జీవించడానికి,

ఉదారంగా ప్రేమించడానికి సహాయపడితే,

ఈస్టర్ కేవలం పండుగ కాదు—

మనం కొత్తగా ప్రారంభించే జీవితం అవుతుంది. ఆమేన్.

Translated by: Rev. Fr. Francis Theetla, Parish Priest of Paidikaluva, Cuddapah.